పచ్చి రొట్ట సాగుతో బహుళ ప్రయోజనాలు

- పచ్చి రొట్ట విత్తనాల పంపిణీకి చర్యలు
- 50శాతం రాయితీపై విత్తనాల సరఫరా

రకం	పూర్తి ధర	రైతులు చెల్లించాల్సిన ధర
జీలుగు	రూ.123	రూ. 61.50
కట్టె జనుము	రూ.109	రూ.54.50
పిల్లి పెసర	రూ.180	రూ.90


వల్లాపురంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తున్న వ్యవసాయ అధికారులు

గుర్ల: భూసారం పెంచి అధిక దిగుబడులు సాధించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు 50శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు విక్రయిస్తున్నారు. పచ్చి రొట్ట సాగుతో రైతులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. భూమిని సారవంతంగా మార్చాలన్నా, రసాయనిక ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా అధిక దిగుబడులు సాధించడానికి పచ్చి రొట్ట సాగు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

ప్రయోజనాలు ఎన్నో..

పచ్చి రొట్ట సాగు చేయడం వల్ల భూమిలోని పోషకాలు చేనుకు సమతుల్యంగా అందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. చేను పెరుగుతున్న సమయంలో పోషకాల లోపంతో పంటకు నష్టం జరగకుండా పచ్చి రొట్ట సకాలంలో పోషకాలను అందిస్తుంది. దీని వలన ఎరువుల వినియోగం తగ్గుతుంది. పంటలకు మేలు చేసే మిత్ర పురుగులకు ఎటువంటి హాని జరగకుండా ఉంటుంది. ముఖ్యంగా వానపాములు సంఖ్య పెరుగుతుంది. మిత్ర పురుగులు భూమి పొరల్లో వృద్ధి చేసేందుకు ఉపయోగపడుతుంది.

50శాతం రాయితీ

రైతు సేవా కేంద్రాల్లో 50శాతం రాయితీపై పచ్చిరొట్టలో జీలుగు, కట్టె జనుము, పిల్లి పెసర వంటి రకాలు అందుబాటులో ఉన్నాయి. వీటిని రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచారు. రైతులు ముందుగా రైతు సేవా కేంద్రాల్లో బుకింగ్ చేసుకోవాలి. విత్తనాలు వచ్చిన తర్వాత నగదు చెల్లించి విత్తనాలు తీసుకోవాల్సి ఉంటుంది. పచ్చి రొట్ట విత్తనాలు ఖరీఫ్ సాగుకు 30 రోజులకు ముందు విత్తనాలు చల్లాలి. దమ్ము చేసేటప్పుడు పచ్చిరొట్టతో కలిపి దున్నడం వలన భూసారం పెరుగుతుంది.

పేర్లు నమోదు చేసుకోవాలి



పచ్చి రొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాల నుంచి పొందవచ్చు. రైతు సేవా కేంద్రాలకు రైతులు ఆధార్ కార్డు తీసుకువెళ్లి బయోమెట్రిక్ వేయాలి. ఆన్‌లైన్ చేసుకున్న రైతులకు 50శాతం రాయితీతో విత్తనాలు సరఫరా చేస్తున్నాం. - ఎం.తిరుపతిరావు, ఏవో, గుర్ల

కోటలో జీపు జాతా


ఎస్.కోటలో జీపుజాతాలో పాల్గొన్న సిటు నాయకులు, కార్యకర్తలు

శృంగవరపుకోట: పట్టణంలో స్థానిక దేవీ జంక్షన్‌లో సీఐటీయూ నేతృత్వంలో జీపు జాతా మంగళవారం నిర్వహించారు. పట్టణంలోకి వచ్చిన సిటు నాయకులకు పలు కార్మిక సంఘాల సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. సిటు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్ మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్మిక వర్గానికి వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్లు తీసుకొచ్చిందన్నారు. దీని వల్ల కార్మికులు సంఘాలు పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు, వేతనాలు కోరే హక్కు, అన్నీ కోల్పోతారన్నారు. రైతు వ్యతిరేక విధానాలు అమలు చేస్తూ కుట్రలు పన్నుతోందన్నారు. ఢిల్లీ నడిబొడ్డున ఏడాదిన్నర పాటూ చేసిన పోరాటంలో 773మంది రైతులను పొట్టన పెట్టుకున్నారన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం రైతులు పండించే పంటకు మద్దతు ధర ఇవ్వకుండా రైతుల్ని నట్టేట ముంచుతున్న ప్రభుత్వం అన్నారు. జాతాలో బి.సుధారాణి, తదితర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు తిప్పికొట్టాలి

కొత్తవలస /లక్కవరపుకోట : దేశంలో పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను తెచ్చిందని, వెంటనే వాటిని రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు అందజేయాలని కోరుతూ మే 20 దేశ వ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నట్టు సీఐటీయూ జిల్లా కార్యదర్శి సురేష్ తెలిపారు. సమ్మె విజయవంతం కోసం జిల్లా వ్యాప్తంగా జీపుజాతా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా కొత్తవలస, లక్కవరపుకోట మండలాల్లో జీపుజాతా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ జాతి ప్రయోజనాలకు వ్యతిరేకంగా మోదీ ప్రభుత్వం పాలన చేస్తోందని దుయ్యబట్టారు.

సంతాపం


నాగమయ్య (ఫైల్)

వేపాడ: మండలంలోని బల్లంకి పంచాయతీ మాజీ సర్పంచ్ బల్లంకి నాగమయ్య(85) అనారోగ్యం, వృద్ధాప్యంతో మృతి చెందారు. ఈయన పంచాయతీ సర్పంచ్‌గా 1982 నుంచి 1989 వరకు పని చేశారు. ఈయన మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాగమయ్యకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రస్తుతం బల్లంకి పంచాయతీ సర్పంచ్‌గా నాగమయ్య రెండో కోడలు బల్లంకి వరలక్ష్మి ఉన్నారు.

కూలేందుకు సిద్ధంగా బస్ షెల్టర్


పాచలవలస వద్ద కూలేందుకు సిద్ధంగా ఉన్న బస్ షెల్టర్

దత్తిరాజేరు: మండలంలోని పాచలవలస కూడలి వద్ద కూలేందుకు సిద్ధంగా బస్ షెల్టర్ ఉండడంతో గ్రామస్తులు, ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. సుమారు 15 సంవత్సరాల కిందట నిర్మించిన బస్ షెల్టర్ కావడంతో గోడలు బీటలు వారి ఉండడంతో ఎటు చూసినా పెచ్చులు ఊడడంతో ప్రయాణికులు భయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కూలేందుకు సిద్ధంగా ఉన్న బస్ షెల్టర్‌ను తొలగించి నూతనంగా నిర్మించాలని గ్రామస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.

17,565 మంది వేతనదారుల బీమా నమోదు

బొండపల్లి: ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన కింద ఉపాధి వేతనదారులు మండలంలో 17,565 మంది బీమాకు సంబంధించి దరఖాస్తులు అందజేసినట్టు ఏపీవో అరుణకుమారి మంగళవారం తెలిపారు. ఉపాధి అధికారులతో పాటు వెలుగు అధికారులు, బ్యాంకు మిత్రలు కలిసి ఉపాధి వేతనదారులతో ఈ బీమాలో చేర్పించి దరఖాస్తులను అయా బ్యాంకు అధికారులకు అందజేసినట్టు చెప్పారు. ప్రమాదవశాత్తు వేతనదారుడు మరణిస్తే వారి కుటుంబానికి రూ.రెండు లక్షలు బీమా మొత్తం అందజేయనున్నట్టు తెలిపారు.

బాధితుడికి ఆర్థిక సాయం


దేముడుబాబుకు నగదు అందజేస్తున్న సభ్యులు

వేపాడ: మండలంలోని వీలుపర్తి పంచాయతీ దుంగాడ గ్రామానికి చెందిన జోడు దేముడు బాబు ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడి కాలు విరిగిపోయింది. దీంతో గ్రామానికి చెందిన త్రిపురమాంబ హెల్పింగ్ హ్యాండ్స్ బాధితుడు దేముడుబాబుకు మంగళవారం రూ.పది వేలు ఆర్థిక సాయం అందజేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నవధాన్యాల సాగుతో అధిక దిగుబడి


రైతులకు అవగాహన కలిగిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

గజపతినగరం రూరల్: నవధాన్యాల సాగుతో రైతులు అధిక దిగుబడి పొందవచ్చని జిల్లా వ్యవసాయ సంచాలకులు ఎ.రామారావు తెలిపారు. మండలంలోని కాలంరాజుపేట ఆర్‌ఎస్‌కే వద్ద నవధాన్యాల సాగుపై మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవధాన్యాల సాగుతో నేల గుల్లబారి సూక్ష్మజీవులు, వానపాములు అభివృద్ధి చెందడమే కాకుండా నేలలో నీటి సామర్థ్యం పెరుగుతుందన్నారు. ప్రధాన పంటలో చీడపీడలు తెగుళ్లు తట్టుకునే సామర్థ్యం పెరిగే అవకాశం ఉంటుందన్నారు. పూర్తి స్థాయి అవగాహన కలిగించడంతో పాటు స్థానిక రైతులకు నవధాన్యాల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ మహారాజన్, ఏఓ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దారగంగమ్మ అమ్మవారి పండగ


ఎస్.కోట: దారగంగమ్మ సన్నిధిలో భక్తులు


వేపాడ: బొద్దాంలో చిన్నారుల నృత్యప్రదర్శన

శృంగవరపుకోట: గ్రామదేవత దారగంగమ్మ అమ్మవారి చిన్న పండగ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పసుపు - కుంకుమలు, చీర, సారెలు పంపిణీ చేశారు. ఉదయం నుంచి అమ్మ దర్శనానికి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై దర్శించి చీరలు-రవికెలు, గాజలు-పూసలు, పూలు-పండ్లు, మొక్కుబడులు, పిండి వంటలు సమర్పించారు. ఆలయంలో అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని మేళతాళాలు, భాజా భజంత్రీలతో ఊరేగించారు. చలిమిడి దీపాలతో దారగంగమ్మ తల్లి దేవాలయంలో సాయంత్రం 8గంటలకు అమ్మవారికి ఆహ్వానం పలికారు. దీపోత్సవం, విశేష హారతులు ఇచ్చి అమ్మవారి తీర్థ ప్రసాదాలు భక్తులకు అందచేశారు.

జగ్గయ్యపేటలో...

వేపాడ: మండలంలో జగ్గయ్యపేట గ్రామదేవత పైడితల్లమ్మ అమ్మవారి పండగ మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. అమ్మ వారి పండగ గత వారం రోజులుగా నిర్వహిస్తున్నారు. సోమవారం తొలేళ్ల ఉత్సవం నిర్వహించిన గ్రామస్తులు మంగళవారం అమ్మవారి పండగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఘటాలు ఊరేగింపు నిర్వహించారు. కోలాటం, తప్పెటగుళ్లు, పులివేషాలు, రేలారేరేలా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆలయం చేరుకున్నారు. ఆలయం వద్ద అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని బొద్దాం గ్రామంలో మంగళవారం పైడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

ఉపాధి సిబ్బందిపై చర్యలకు డిమాండ్


కార్యక్రమంలో మాట్లాడుతున్న భీముడు, అప్పారావు

గంట్యాడ: నరవ గ్రామంలో బినామీ ఫీల్డ్ అసిస్టెంట్‌ను కొనసాగిస్తున్న ఉపాధి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు గండేపల్లి భీముడు, ప్రధాన కార్యదర్శి పురం అప్పారావు డిమాండ్ చేశారు. మండలంలోని నరవ గ్రామంలో టెంటవారి చెరువు వద్ద మంగళవారం వేతనదారులకు ఉపాధి హామీ చట్టం గురించి అవగాహన కల్పించారు.

ఉపాధి హామీ పథకం దివంగత నేత వైఎస్.రాజశేఖర రెడ్డి హయాంలో ప్రవేశ పెట్టారని తెలిపారు. రోజుకి రూ.700 వేతనం, ఏడాదికి 200 రోజులు పని కల్పించాలన్నారు. పని ప్రదేశాల్లో మౌలిక వసతులు, మజ్జిగ, మంచినీరు, ఓఆర్ఎస్ ద్రావణం కల్పించాలన్నారు. వేసవి అలవెన్సులు వెంటనే పునరుద్ధరించాలన్నారు. జెంక వాణి, డెంక వాణి చెరువులో కొంత మంది గ్రూపులు వారికి జియో ట్యాగింగ్ చేసి మరి కొన్ని గ్రూపులకు జియో ట్యాగింగ్ చేయకుండా ఉన్న ఉపాధి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆరు నెలలకు ఒకసారి మేట్లును మార్పు చేయాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలన్నారు.

బడిలో పిల్లలను చేర్పించండి


బల్లంకిలో ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

వేపాడ: ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించండి అంటూ నీలకంఠరాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు మంగళవారం బల్లంకి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. హైస్కూలు ప్రధానోపాధ్యాయులు సిహెచ్.వెంకటరావుతో పాటు ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటికి వెళ్లి పాఠశాలలో చేర్పించాలని ప్రభుత్వ ప్రోత్సాహకాలు పొందాలని కోరారు. యూనిఫారం, ఉచిత పుస్తకాలతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు బోధన అందిస్తున్నట్లు చెప్పారు.

క్లుప్తంగా

అమ్మవారి ఆలయంలో పాడ్యమి పూజలు


అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గ్రామంలో రాజరాజేశ్వరి దేవి అమ్మవారి ఆలయంలో బహుళ పాడ్యమి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని అర్చకులు ధూసి శ్రీధర్ శర్మ ప్రత్యేకంగా అలంకరించగా పరిసర గ్రామాల భక్తులు ప్రభలు, బ్యాండు మేళాలతో పాటు ఘటాలతో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు


విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహిస్తున్న లైబ్రేరియన్

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కరెంటు అఫైర్స్ అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. సమ్మర్ క్యాంప్ కార్యక్రమంలో భాగంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు ఈ క్విజ్ పోటీలను నిర్వహించారు. క్విజ్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు సమ్మర్ క్యాంపు ముగింపు రోజున బహుమతులను అందజేస్తామని లైబ్రేరియన్ ఎం.ఉషారాణి తెలిపారు. సమ్మర్ క్యాంపు జూన్ 6వ తేదీ వరకు జరుగుతుందని తెలిపారు.

శరవేగంగా మజ్జిగౌరి ఆలయ నిర్మాణం


మజ్జిగౌరి ఆలయ నిర్మాణ పనులు

గజపతినగరం రూరల్: మండలంలోని గంగచోళ్లపెంట గ్రామంలో మజ్జిగౌరి తల్లి ఆలయ పునర్నిర్మాణ పనులు జోరందుకున్నాయి. గ్రామంలో గతంలో ఉండే ఆలయం భక్తులకు అసౌకర్యంగా ఉండటంతో గ్రామస్తులంతా చందాలు పోగు చేసుకుని పునర్నిర్మాణం చేపట్టారు. గతంలో కన్నా విశాలంగా ఆలయ నిర్మాణం జరగడమే కాకుండా భక్తులకు పూర్తి స్థాయి సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నట్టు గ్రామ పెద్దలు తెలిపారు. జూలై నెల మొదటి వారంలో అమ్మవారి పండగను పురస్కరించుకుని ఆలయ నిర్మాణం పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు చెప్పారు.

40 మందికి కంటి పరీక్షలు


రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వేపాడ: మండల కేంద్రంలో మంగళవారం శంకర్ ఫౌండేషన్ అధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 40 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్టు క్యాంపు కో ఆర్డినేటర్ జోగారావు తెలిపారు. ఆప్తాల్మిక్ జాక్సన్, పీఎంవో ఈశ్వర్రావు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు నిర్వహించిన 40 మందిలో 26 మందిని కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్టు జోగారావు తెలిపారు. ఉచితంగా కంటి ఆపరేషన్ చేసి కంటి అద్దాలు అందిస్తామని తెలిపారు.

బాలల హక్కులపై అవగాహన


దబ్బిరాజుపేటలో బాలల హక్కులను వివరిస్తున్న కార్యకర్తలు

వేపాడ: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం కిశోర వికాసంలో భాగంగా బాలల హక్కులు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించినట్టు అంగన్‌వాడీ కార్యకర్తలు నూకరత్నం, ఎస్ఏ జ్యోతి, దేముడమ్మ తెలిపారు. దబ్బిరాజుపేటలో నిర్వహించిన కార్యక్రమంలో బాలలకు పౌష్టికాహారం తీసుకోవటంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాలు వల్ల కలిగే నష్టాలను వివరించారు. అలాగే బొద్దాంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కామేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్సులకు సన్మానం



మండల కేంద్రమైన గజపతినగరం సామాజిక ఆసుపత్రిలో ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని వైద్య సిబ్బంది మంగళవారం ఘనంగా నిర్వహించారు. సామాజిక ఆసుపత్రిలో గత కొన్నాళ్లుగా హెడ్ నర్సుగా పని చేస్తున్న రామయ్యమ్మను తోటి నర్సులు సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో అందరి కన్నా రోగులకు సేవ చేసే అదృష్టం ఒక్క నర్సులకే దక్కిందన్నారు. అన్ని రకాల రోగులు పట్ల బంధువుల్లా ప్రవర్తించి సేవలు అందించడం వలన సమాజంలో నర్సులకు మంచి గుర్తింపు ఉందన్నారు. - గజపతినగరం

పండగ తెచ్చిన ట్రాఫిక్ కష్టాలు



పల్లెల్లో జరుగుతున్న పండగలు పట్టణాల్లో ట్రాఫిక్ కష్టాలు తెచ్చి పెడుతున్నాయి. గరివిడి మండలంలోని వెదుళ్లవలస గ్రామంలో రెండు రోజులుగా గ్రామ దేవత పండగ జరుగుతోంది. దాదాపు రెండు దశాబ్దాలు తరువాత జరిగే పండగ కావడంతో గ్రామస్తులు అట్టహాసంగా పండగ జరుపుకుంటున్నారు. దీంతో ఆ గ్రామానికి వెళ్లే బంధువులు, ఆత్మీయులతో మంగళవారం చీపురుపల్లి పట్టణంలోని ఆర్‌వోబీ వద్ద భారీ ఎత్తున ట్రాఫిక్ స్తంభించిపోయింది. - చీపురుపల్లి

ఘనంగా అమ్మవారి సిరిమానోత్సవం



గంట్యాడ మండలంలోని పెంటశ్రీరాంపురం గ్రామంలో శ్రీ బొర్రాపైడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా మంగళవారం నిర్వహించిన సిరిమానోత్సవం ఘనంగా జరిగింది. గ్రామ పుర వీధుల్లో మూడుసార్లు సిరిమాను, గంటల రథం, తెల్ల ఏనుగు తిరిగాయి. 20 ఏళ్ల తర్వాత పండగ చేస్తుండడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అంతకు ముందు తెల్లవారు జాము నుంచే అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. - గంట్యాడ

విద్యుత్ స్తంభం ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్


విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న అధికారులు, సిబ్బంది

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని చుక్కవలస రెవెన్యూ పరిధిలో గల రైతు భూమిలో శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి ట్రాన్స్‌కో అధికారులు కొత్తగా మరొక విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 12న సాక్షి దిన పత్రికలో శిథిలావస్థలో విద్యుత్ స్తంభం శీర్షికన వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు అధికారులు ఫీల్డు విజిట్ చేసి సిమెంటు పెచ్చులూడి విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉండటంతో వెంటనే చర్యలు చేపట్టారు. పక్కనే కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ లైన్ అమర్చారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

భూములు పోకుండా పైపులైన్ వేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

గంట్యాడ: రైతులు భూములు పోకుండా ప్రత్యామ్నాయంగా విశాఖ నుంచి రాయపూర్ వెళ్లే గ్రీన్ హైవే పక్కన హెచ్‌పీసీఎల్ వారు పైప్ లైన్ వేసుకోవాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి బుద్దరాజు రాంబాబు డిమాండ్ చేశారు. గంట్యాడలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పైప్ లైన్ భూమి వినియోగపు హక్కు కొరకు తీసుకునే ఉపరితల భూమిపై ఇళ్లు, తోటలు, బోర్లు, కట్టడాలు, పశువులు, కోళ్లు, షెడ్లు తదితర వేసుకొనే అవకాశం లేనందున, మొత్తం భూమి విలువ కోల్పోతున్నందున రిజిస్టర్ విలువ తీసుకుంటే నాలుగు రెట్లు పెంచి ధరను నిర్ణయించాలని డిమాండ్ చేశారు. అందులో నుంచి 30 శాతం పరిహారం లెక్కకట్టి ఇవ్వాలన్నారు. పండ్ల తోటలు, చెట్లు జీవిత కాలాన్ని లెక్కించి పరిహారం ఇవ్వాలన్నారు. తోటలు ఉన్న చోట ఐదు మీటర్లు మించి తీసుకోరాదన్నారు. సమావేశంలో రైతు సంఘం ఉపాధ్యక్షుడు లోకవరపు ఆదినారాయణ, మండల అధ్యక్షుడు కోడెల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై షేర్ నెట్ యూనిట్ల మంజూరు

బొండపల్లి: కాయగూరలును సాగు చేసే రైతులను ప్రోత్సహించే లక్ష్యంతో వెలుగు, ఉద్యానవన శాఖల ద్వారా 50 శాతం సబ్సిడీతో షేర్ నెట్ యూనిట్‌లను స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళా రైతులకు మంజూరు చేయనున్నట్టు వెలుగు ఏపీఎం కె.పెంటంనాయుడు, ఉద్యానవన శాఖాధికారి రాజశేఖర్ తెలిపారు. కనిష్ఠంగా 20 సెంట్లుకు తక్కువ కాకుండా విస్తీర్ణంలో కాయగూరలను సాగు చేసే రైతులకు షేర్ నెట్ యూనిట్లు కింద రూ.లక్షా 15 వేలు సబ్సిడీతో పాటు కాయగూరలను సాగు చేసిన తర్వాత మరో రూ.35 వేలు మొత్తంగా 50 శాతం ఇవ్వనున్నట్టు తెలిపారు. మిగిలిన 50 శాతం మొత్తాన్ని స్త్రీనిధి కింద బ్యాంకు ద్వారా రుణాన్ని వడ్డీకి ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల రైతులు రెండు శాఖల అధికారులను కలిసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల పంపిణీ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

చీపురుపల్లి: అజ్ఞానం నుంచి దైవ జ్ఞానం వైపు అడుగులు వేయాలని రాజాం మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక అధ్యక్షుడు రామినాయుడు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో దుకాణాలు, వ్యాపార సంస్థలకు 101 త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల కోసం వివరించి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమావాస్య రోజున అజ్ఞానం వదిలి జ్ఞానం వైపు ప్రయాణించాలన్నారు. ప్రతీ ఒక్కరూ శ్రీ కృష్ణుడు, భగవద్గీతను విశ్వసించాలని కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు సూరపునాయుడు, మద్దిరాజు, రమణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

